**సంక్రాంతి పండుగకు** సొంతూరి రావాలనుకునే వారికి ఇబ్బందులు తప్పడం లేదు. సరిపడా రైళ్లు లేక.. ఉన్న బస్సులు సరిపోక ప్రయాణికులు అనేక పాట్లు పడాల్సి వస్తోంది. ఇప్పటికే ఒకవైపు రైల్వే శాఖ పలు రైళ్లను రద్దు చేయడంతో చాలా రైళ్లు నడవడం లేదు. ఇలాంటి సమయంలో ఆర్టీసీ అదనపు సర్వీసులు ఏర్పాటుచేయాలి. అయితే పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు నడుపుతామని అధికారులు చెబుతున్నప్పటికీ ప్రయాణికులకు అనుగుణంగా సర్వీసులు లేక ఇంటికి వెళ్లడమెలా అని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా రద్దీ రూట్లలో ఈ సమస్య ఎక్కువగా ఉంటున్నదని. బస్సులో సీట్ల కోసం పోటీపడాల్సి వస్తున్నదని ఇప్పటికైనా సరిపడా బస్సులు వేయాలని కోరుతున్నారు.

*- మహబూబాబాద్, జనవరి 9(నమస్తే తెలంగాణ)*

■ బస్సు వచ్చేనా.. సీటు దొరికేనా?



మహబూబాబాద్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

# రైళ్లు లేక.. బస్సులు రాక

**పండుగకు ఇంటికి పోవుడెట్ల**

- రద్దీకి అనుగుణంగా లేని సర్వీసులు
- ఇప్పటికే పలు రైళ్లు రద్దు..
- కొన్ని రూట్లలో 'పల్లె వెలుగు'లే దిక్కు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

సంక్రాంతి పండుగకు విద్యార్థులు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు సొంత ఊరికి చేరుకుంటారు. రైళ్లు అరకొరగా నడుస్తుండడంతో వారంతా బస్సులపై ఆధారపడుతున్నారు. రైళ్లు రద్దయిన సందర్భంలో ఆర్టీసీ అదనంగా బస్సు సర్వీసులు విధిగా నడపాల్సి ఉంటుంది. ఇది ఎక్కడా అమలు కావడం లేదు. రైల్వే శాఖ మూడో లైన్ పనులు, ఇతర మరమ్మతుల కారణంగా గత నెల 28 నుంచి కొన్ని రైళ్లను రద్దు చేసింది. ఇక జనవరి మొదటి వారం నుంచి కొన్ని రైళ్లను సికింద్రాబాద్ నుంచి వయా నల్లొండ జిల్లా మీదుగా నడుపుతుండగా, మరికొన్ని రైళ్లు రద్దు అయ్యాయి. ఈ క్రమంలో నిత్యం వేల సంఖ్యలో ప్రయాణించే ఉద్యోగులు, వ్యాపారాలు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, తదితర ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. గత నాలుగైదు రోజుల నుంచి కాజీపేట నుంచి విజయవాడ వైపు ఉదయం పూట ఒకటి రెండు రైళ్లు మినహాయిస్తే మిగిలినవన్నీ దాదాపు నడవలేదని ప్రయాణికులు చెబుతున్నారు. ఒకవైపు రైళ్ల రద్దు, మరోవైపు సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు ప్రస్తుతం నడుస్తున్న బస్సులతో పాటు మరిన్ని సర్వీసులు కేటాయించాల్సి ఉండగా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించినట్లు ప్రయాణికులు వాపోతున్నారు. మహబూబాబాద్ నుంచి వయా గూడూరు, నర్సంపేట మీదుగా వరంగల్‌కు వెళ్లేందుకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు గంటలకు ఒకటి ఎక్స్‌ప్రెస్ బస్సు వస్తే దాని వెంట వందల మంది ప్రయాణికులు పరిగెత్తాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక మహబూబాబాద్ నుంచి తొర్రూరుకు అన్ని పల్లె వెలుగు బస్సులు తప్ప ఎక్స్‌ప్రెస్ బస్సుల్లేవని ప్రయాణికులు వాపోతున్నారు. మహబూబాబాద్ నుంచి వయా కురవి, మరిపెడ మీదుగా సూర్యాపేటకు వెళ్లాలంటే కూడా పల్లె వెలుగు బస్సు దిక్కు అయింది. అటు రైళ్లు లేక, ఇటు బస్సులు రాక ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారు. పండుగకు మరో మూడు రోజులే ఉండటంతో సొంతూళ్లకి వేలాదిగా తరలివచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడపాలని డిమాండ్ చేస్తున్నారు.




మహబూబాబాద్‌లో ప్రైవేట్ వాహనాల్లో వెళ్తున్న ప్రయాణికులు

**బస్సులు అదనంగా నడపాలి**

గత పది రోజులుగా రైళ్లు నడవడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. మరోవైపు బస్సులు కూడా అరకొరగా నడుపుతున్నారు. అదనంగా బస్సులు నడపాలి. సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తమ సొంత గ్రామాలకు తరలివస్తున్నారు. దీంతో రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడపాలి.

*– బత్తిని కిషోర్, ప్రయాణికుడు, మహబూబాబాద్*



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న మహబూబాబాద్ రైల్వే స్టేషన్

# కొత్తకొండ జాతరకు వేళాయె

- నేటి నుంచి 18వరకు బ్రహ్మోత్సవాలు
- సాయంత్రం స్వామి వారి కల్యాణం

భీమదేవరపల్లి, జనవరి 9 : భక్తుల కొంగుబంగారం కొత్తకొండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మకర సంక్రాంతిని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణంతో మొదలయ్యే జాతర ఈ నెల 18న వీరభద్రుని గ్రామ పర్యటనతో ముగుస్తుంది. జాతరకు తెలంగాణ నుంచే గాక ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి భక్తులు వేలాదిగా తరలివచ్చి దర్శించుకుంటారు. కోరిన కోర్కెలు తీర్చాలని కోరమీసాలు సమర్పిస్తారు. స్వామి వారి కల్యాణానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సతీ సమేతంగా హాజరుకానున్నారు. ఈమేరకు భక్తుల కోసం అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా 600మందితో భారీ బందోబస్తు చేయనున్నట్లు కాజీపేట ఏసీపీ తిరుమల్ చెప్పారు. జాతర సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుస్తాయి. వరంగల్–1, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోల నుంచి కొత్తకొండకు నిరంతరం బస్సులు ఉంటాయి.

**కార్యక్రమాలివీ**

10న వీరభద్రస్వామి కల్యాణం, 13న భోగి పండుగ, 14 సంక్రాంతి పర్వదినాన బండ్లు తిరుగుట, 15న కనుమ ఉత్సవం, 16న నాగవెల్లి, పుష్పయాగం, 17న త్రిశూల స్నానం, 18 తెల్లవారుజామున అగ్నిగుండాలు, అదే రోజున సాయంత్రం గ్రామపర్యటన ఉంటాయి.

**త్వరలో ఉత్తర్వులిస్తాం**



టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో ఎంపికైన జేఏసీసీవో పోస్టులకు సంబంధించి ఎంపికైన అభ్యర్థులకు త్వరలో నియామక ఉత్తర్వులు అందజేస్తాం. కోర్టు కేసు నేపథ్యంలో మొత్తం వంద పోస్టుల్లో ఆరింటిని మినహాయించి మిగిలిన 94 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశాం. 2023 జూన్ 4న రాత పరీక్ష నిర్వహించి కోర్టు నుంచి క్లియరెన్స్ రాగానే గత ఏడాది ఆగస్టు 1న ఫలితాలు వెల్లడించాం. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను కూడా పూర్తి చేశాం. త్వరలోనే నియామక ఉత్తర్వులు ఇచ్చేందుకు అన్నీ సిద్ధం చేస్తున్నాం.

*–కర్నాటి వరుణ్‌రెడ్డి, సీఎండీ, టీజీఎన్పీడీసీఎల్*

- ఇప్పటికే పరీక్షలు జరిగి వెల్లడైన ఫలితాలు
- సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయి నాలుగు నెలలు
- ఉత్తర్వులు జారీ కాకపోవడంతో ఆందోళనలో అభ్యర్థులు
- త్వరలో అందజేస్తామంటున్న సీఎండీ




హనుమకొండలోని విద్యుత్ భవన్

# నియామకాలెప్పుడు..?

## ఎన్పీడీసీఎల్ జేఏసీసీవో పోస్టుల భర్తీలో జాప్యం

**కాంగ్రెస్ సర్కారు ఒక్క నోటిఫికేషన్** ఇవ్వకుండానే వేల ఉద్యోగాలు భర్తీ చేశామని గొప్పలు చెప్పకొంటున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే నియామకాల ప్రక్రియ పూర్తి కాగా, కేవలం ఉత్తర్వులు అందజేసి తమ ఘనతగా చాటుకుంటున్నది. ఇందులో భాగంగా నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్పీడీసీఎల్)లో చేపట్టిన ఉద్యోగాల భర్తీలో మాత్రం జాప్యం చేస్తున్నది. 2023లో 94 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ (జేఏసీసీవో) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. పరీక్షలు జరిగి ఫలితాలు సైతం వెల్లడి కాగా, నాలుగు నెలల క్రితం సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది. అప్పటి నుంచి నియామక ఉత్తర్వులు అందించకపోవడంతో ఎంపికైన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఏడాదిన్నరగా జేఏసీసీవో పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. అయితే ఈ నియామకాలు చేపడితే సిబ్బంది కొరతతో ఉద్యోగులపై పడిన పనిభారం, ఒత్తిడి తగ్గుతుందనే అభిప్రాయం సంస్థ ఉద్యోగుల నుంచే వ్యక్తమవుతున్నది.

*- హనుమకొండ, జనవరి 9*

టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ (జేఏసీసీవో) పోస్టుల భర్తీ విషయంలో జరుగుతున్న జాప్యంపై అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నోటిఫికేషన్‌కు అనుగుణంగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, పరీక్షలు నిర్వహించిన ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఫలితాల వెల్లడిలో ఆలస్యం చేసింది. అయితే ఇందుకు సంబంధించిన కేసు కోర్టులో ఉండడంతోనే జాప్యం జరిగిందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తంమీద గత ఏడాది ఆగస్టు 1న ఫలితాలు విడుదల చేసిన యాజమాన్యం సర్టిఫికెట్ల పరిశీనలను సైతం పూర్తి చేసింది. ఇదంతా జరిగి సుమారు నాలుగు నెలలు దాటుతున్నప్పటికీ ఉత్తర్వులు జారీ చేయలేదు. దీంతో హనుమకొండలోని ఎన్పీడీసీఎల్ కార్యాలయం చుట్టూ ఎంపికైన అభ్యర్థులు తిరుగుతున్నారు. అయినప్పటికీ అధికారులు స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదని, దీని వెనుక ఆంతర్యం ఏమిటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. తమను రోజుల తరబడి తిప్పించుకోవడంపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నియామక ఉత్తర్వులు జారీ చేయడంపై ప్రభుత్వ పెద్దలు, సంబంధిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**పునర్విభజనతో పెరిగిన ఒత్తిడి**

కొత్త జిల్లాలు ఏర్పడిన నేపథ్యంలో టీజీఎన్పీడీసీఎల్ సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లను పునర్విభజన చేసినట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. దీంతో వారినే సర్దుబాటు చేయడంతో వారిపై పని ఒత్తిడి పెరిగిందని పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలోనే జేఏసీసీవో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కావడంతో వెంటనే ప్రక్రియ పూర్తయితే పనిభారం తగ్గుతుందని అనుకున్నామంటూ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

*విధుల్లో నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాల ఆరోపణల నేపథ్యంలో గురువారం ఉమ్మడి జిల్లాలో ఒకే రోజు నలుగురిపై వేటు పడింది. జీపీ ఖాతా నుంచి నిధులు కాజేసినందుకు తొర్రూరు ఎంపీడీవో నర్సింగరావును, విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినందుకు వరంగల్ డీటీవో గంధం లక్ష్మిని, అలాగే విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించినందుకు దొబ్బలపాడు పీఈటీ మంతెన భానుప్రకాశ్, కూనూరు జీపీ కారోబార్ క్రాంతికుమార్‌పై ఆ జిల్లాల కలెక్టర్లు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం సంచలనం రేపింది. ఈ నిర్ణయంతో బాధితుల్లో హర్షం వ్యక్తమవుతుండగా అవినీతి అధికారుల్లో దడ మొదలైంది.*

# విధుల్లో నిర్లక్ష్యం నలుగురిపై వేటు

- వేర్వేరు చోట్ల ఘటనలు
- ఎంపీడీవో, డీటీవో, పీఈటీ, కారోబార్‌పై క్రమశిక్షణ చర్యలు

## తొర్రూరు ఎంపీడీవో సస్పెన్షన్

**ఎంపీవోకు షోకాజ్ నోటీసులు**

తొర్రూరు, జనవరి 9 : తొర్రూరు ఎంపీడీవో నర్సింగరావును సస్పెండ్ చేయడంతో పాటు ఎంపీ వో పూర్ణచందర్‌రెడ్డికి షోకాజ్ నోటీసులను ఇస్తూ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 4న పెద్దవంగర మండలం బొమ్మకల్లు జీపీ ఖాతా లోంచి అక్రమంగా రూ.1.10 లక్షల నగదును డ్రా చేసి తిరిగి 6న జమచేసినందుకు గాను కలెక్టర్ చర్యలు తీసుకున్నారు. ఆయన స్థానంలో పెద్దవంగర ఎంపీడీవో బి.వేణుమాధవ్‌కు తొర్రూరు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగించా రు. అంతేగాక ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో కలిసి మరికొంతనగదు కాజేశారని అధికారులు, సిబ్బందిపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## పీఈటీ అసభ్య ప్రవర్తన


**ఉద్యోగం నుంచి తొలగింపు**

మహాముత్తారం, జనవరి 9 : విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన పీఈటీపై వేటు పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం దొబ్బలపాడు ప్రభుత్వ ఆదర్శ పాఠశాల విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించి, దూషించిన వ్యాయామ ఉపాధ్యాయుడు(ఔట్ సోర్సింగ్ ఉద్యోగి) మంతెన భానుప్రకాశ్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. ఈమేరకు తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల అదనపు డైరెక్టర్ శ్రీనివాసాచారి ఆదేశాలు జారీ చేసినట్లు దొబ్బలపాడు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ రవి తెలిపారు.

## వరంగల్ డీటీవో సరెండర్

ఖిలావరంగల్, జనవరి 9 : వరంగల్ రవాణా శాఖ అధికారి గంధం లక్ష్మిని ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ సత్యశారద ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల నిర్వహణపై నిర్లక్ష్యం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షలో డీటీవో వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మెమో జారీ చేశారు. 24గంటల్లో సరైన సమాధానం ఇవ్వకపోవడంతో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. కాగా డీటీవోగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆమెపై తరచూ ఆరోపణలు వస్తూనే ఉన్నాయి. కార్యాలయం ఎదుట ఏజెంట్లుగా చలామణి అవుతున్న కొంతమందిని సెక్యూరిటీ గార్డుగా నియమించి వారితో పనులు చక్కపెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తాయి. అంతేగాక కార్యాలయంలో అందుబాటులో ఉండకపోవడం, ఆన్‌లైన్ ప్రక్రియ సకాలంలో నమోదు కావడం లేదని ప్రజాప్రతినిధులు, ఓ సంస్థ చైర్మన్ ఇటీవల ఆ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సంఘటనలు కూడా ఉన్నాయి. కాగా డీటీవో సరెండర్‌తో ప్రభుత్వ అధికారుల్లో అలజడి మొదలైనట్లు తెలిసింది.

## నకిలీ రసీదులతో నిధులు స్వాహా



విచారిస్తున్న ఎంపీడీవో సుమన్, కారోబార్ ఇచ్చిన నకిలీ రసీదు

- కూనూరు జీపీలో ఇంటి, నల్లా పన్నుల బిల్లుల్లో కారోబార్ చేతివాటం
- విచారణ చేపట్టిన ఎంపీడీవో సుమన్
- విధుల నుంచి తొలగింపు

జఫర్‌గఢ్, జనవరి 9 : జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలోని కూనూరు జీపీ పరిధిలో నకిలీ రసీదులతో ఇంటి, నల్లా పన్నులు స్వాహా చేసిన కారోబార్‌పై ఎంపీడీవో సుమన్ గురువా రం విచారణ చేపట్టారు. గ్రామస్తుల సమక్షంలో నకిలీ రసీదులు, బుక్కులను పరిశీలించారు. కారోబార్ (మల్టీపర్పస్ వర్కర్) యాదనాల క్రాంతికుమార్‌పై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఎంపీడీవో, గ్రామ ప్రత్యేకాధికారి సుమన్ విచారించి, వసూలు చేసిన పన్నులను జీపీ రికార్డుల్లో, ఎస్టీవోలో నమో దు చేయకుండా సొంతానికి వాడుకున్నట్లు తేల్చారు. రికార్డులను పూర్తిగా పరిశీలించి డబ్బులను రికవరీ చేస్తామని ఎంపీడీవో తెలిపారు. క్రాంతికుమార్‌ను విధుల నుంచి తొలగించినట్లు, తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు తెలుపనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గర్వందుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# స్టాక్ పాయింట్ ఇన్‌చార్జి బదిలీ

- గోదాం ఇన్‌చార్జి పనితీరుపై కలెక్టర్ విచారణ
- రేషన్ దుకాణాల్లో క్షేత్రస్థాయి తనిఖీలకు ఆదేశాలు

**నమస్తే ఎఫెక్ట్**

జనగామ, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : చంపక్‌హిల్స్ స్టాక్ పాయింట్ గోదాం ఇన్‌చార్జి బదిలీ అయ్యారు. డిసెంబర్ 29న 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'పేదల బియ్యం పక్క దారి.. స్టాక్ పాయింట్లే అడ్డాగా దందా' కథనానికి జిల్లా యంత్రాంగం స్పందించింది. పౌరసరఫరాల శాఖ ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో జరుగుతున్న వ్యవహారంపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని మందలించినట్లు సమాచారం. గోదాముల వద్ద ఇన్‌చార్జి బాధ్యుల పనితీరుపై ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలని కూడా ఆదేశించినట్లు తెలిసింది. పీడీఎస్ బియ్యం సరఫరాలో కోత అంశాన్ని సహా బియ్యం తూకం వేయకుండా లారీ టు లారీ అన్‌లోడ్ విధానంలో నేరుగా రేషన్ దుకాణాలకు సరుకులు పంపుతున్న తీరుపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం. క్షేత్రస్థాయి తనిఖీలు చేపట్టాలని పౌరసరఫరాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. డీలర్లు డీడీలు చెల్లించిన తర్వాత ప్రతి నెలా 15 నుంచి 17వ తేదీ లోపల రేషన్ షాపులకు బియ్యం సరఫరా పూర్తి చేయాలని ఆదేశించినట్లు సమాచారం. ఎనిమిదేళ్లుగా చంపక్‌హిల్స్ స్టాక్ పాయింట్ గోదాం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న శ్రీధర్ రెడ్డిని బదిలీ చేసి ఆయన స్థానంలో పాషాను కలెక్టర్ నియమించారు. బియ్యం సరఫరా చేసే లారీల కాంట్రాక్టర్ సైతం 10 ఏళ్లుగా ఒక్కరే వ్యవహరిస్తున్న తీరుపై కూడా కలెక్టర్ దృష్టి సారించి నివేదిక కోరినట్లు తెలిసింది.




గణిత సూత్రాలతో వేసిన ముగ్గు

# రంగోలీ పాఠాలు..

- ఫార్ములాలు.. పాఠ్యాంశాలతో ముగ్గులు
- అదరగొట్టిన బాలుర పాఠశాల విద్యార్థులు




పీరియాడిక్ టేబుల్ రంగోలి


ఏటూరునాగారం, జనవరి 9 : ఇదేంటి.. ముగ్గుల్లో గణిత ఫార్ములా లు.. సైన్స్ పాఠ్యాంశాలు ఉన్నాయనుకుంటున్నా రా? అవును.. అవి రంగోలీ పాఠాలే.. అది కూడా బాలుర పాఠశాలకు చెందిన 5 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు వేసినవే.. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర క్రీడా పాఠశాల విద్యార్థులకు జన్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. వారిలో సాంకేతిక నైపుణ్యత, సృజనాత్మకత పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అందుకు తగ్గట్లుగానే శాస్త్ర, సాంకేతిక, పరిసరాల పరిజ్ఞానం, గణిత, సామాన్య శాస్త్రానికి సంబంధించిన అంశాలతో అందమైన, ఔరా అనిపించే రంగవల్లులను తీర్చిదిద్దారు. వీరిలో అద్భుత ప్రతిభను కనబర్చిన 18 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రేఖా గణితం, పరిసరాల పరిజ్ఞానం, సామాజిక శాస్త్రం, జీవశాస్త్రం లాంటి అంశాలను పరిగణనలోకి తీసుకున్నారని, దీంతో విద్యార్థులకు డ్రాయింగ్ నైపుణ్యం పెంచుకునే అవకాశం లభించిందన్నారు. తక్కువ ఖర్చుతో బోధనాభ్యాసం పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.



విద్యుత్ బిల్లులు చెల్లించిన రసీదులతో శ్రీను

# కరెంటోళ్ల లీలలు!

- రూ.36 వేల బిల్లు కట్టించుకొని ఆ సర్వీస్ నంబర్ కాదంటున్న అధికారులు
- వేరే నంబర్ మీద రూ.14737 చెల్లించాలని హుకుం
- లబోదిబోమంటున్న వినియోగదారుడు




977 సర్వీస్ నంబర్‌పై వచ్చిన బిల్లు

నర్సింహులపేట, జనవరి 9: 'నీ ఇంటి మీటర్ నంబర్‌పై రూ.36వేల బిల్లు ఉంది. చెల్లించకుంటే కరెంట్ తీసేస్తాం అం టూ అధికారులు హెచ్చరించడంతో డబ్బులు చెల్లించాడు. ఆ తర్వాత అది నీ సర్వీస్ నంబర్ కాదని, నీ మీటర్‌పై రూ.1473 7 బాకీ ఉంది' అని చెప్పడంతో వినియోగదారుడు లబోదిబోమంటున్నాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని కొమ్ములవంచ గ్రామానికి చెందిన డొనికెన శ్రీను విద్యుత్ మీటర్ సర్వీస్ నంబర్ 859 అని, దానిపై రూ.36 వేలు బిల్లు చెల్లించాలని ఏఈతో పాటు అధికారులు వచ్చి సర్వీస్ వైర్ తొలగించి ఇబ్బం ది పెట్టారు. అదే సమయంలో అతడి కూతురు డెలివరీ ఉండడంతో నెల బిల్లుతో పాటు ఫిబ్రవరి నెలలో రూ.5 వేలు చెల్లించాడు. ప్రతి నెల బిల్లుతో పాటు సెప్టెంబర్ వరకు రూ.36 వేలు చెల్లించాడు. ఆ తర్వాత గృహజ్యోతి కోసం ఎంపీడీవో, విద్యుత్ అధికారి కార్యాలయం చుట్టూ తిరగగా మూడు నెలలుగా జీరో బిల్లు వచ్చింది. ఆ సంతోషం కాస్తా కొత్త సంవత్సరం వరకే ఉ న్నది. ఆ తర్వాత నీ మీటర్ సర్వీస్ నంబర్ 859 కాదని, 977 అని, దీనికి రూ.14,737 బిల్లు చెల్లించాలని విద్యుత్ ఏఈ చెప్పాడు. బిల్లు చెలిస్తే నీకు గృ హజ్యోతి వస్తుందని ఇబ్బందులకు గురిచేస్తున్నాడని శ్రీను వాపోయాడు. అధికారుల తప్పిదంతో తన దగ్గర రూ. 36 వేలు వసూలు చేసి పది మందిలో ఇజ్జత్ తీసి పైసలు కట్టించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పుడు ఆ బిల్లు జయపురం గ్రామానికి చెందిన శ్రీను మీటర్ నంబర్ అని చెప్తున్నారని, మళ్లీ పైసలు కట్టమంటున్నారని, ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరాడు.